సాక్షి నాగర్‌కర్నూల్


మంగళవారం ¦ 28 ¦ జనవరి ¦ 2025



‘ఎంఆర్‌ఐ’ సేవలు ఎప్పుడో?

పాలమూరు జనరల్ ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ మిషన్ ఏర్పాటుపై సందిగ్ధం నెలకొంది.

వివరాలు 8లో ▸



పర్యాటకంగా తీర్చిదిద్దాలి

బాదేపల్లి గుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఈమని శివనాగిరెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.9 /13.3

చల్లని గాలులు వీయడంతోపాటు మంచు కురుస్తుంది. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది. ఎండ ప్రభావం చూపిస్తుంది.


న్యూస్‌రీల్

ప్రజావాణికి 50 ఫిర్యాదులు



నాగర్‌కర్నూల్: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటిక ప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్‌తో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా జిల్లాకు సంబంధించిన ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ క్రమంలో ప్రజావాణికి మొత్తం 50 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 8..



నాగర్‌కర్నూల్ క్రైం: పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు త్వరగా పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు 8 ఫిర్యాదులు వచ్చాయని ఇందులో తగు న్యాయం గురించి 3, భూమి పంచాయతీకి 5 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆయా ఫిర్యాదులను పరిష్కార నిమిత్తం సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు పంపిస్తామని చెప్పారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



కందనూలు: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైందని ప్రిన్సిపాల్ అంజయ్య తెలిపారు. హైదరాబాద్ నుంచి పలు కంపెనీలు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించగా సుమారు 60 నుంచి 70 మంది అభ్యర్థులు వివిధ సెక్టార్లలో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జాబ్‌మేళాకు జిల్లాలోని నిరుద్యోగులు, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ జాబ్ మేళా కేవలం మహిళలకు మాత్రమే నిర్వహించడంతో విశేష స్పందన లభించింది.

అన్నదాతల ఆగ్రహజ్వాల

అచ్చంపేటలో రోడ్డెక్కిన రైతన్నలు



అచ్చంపేటలో రైతులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రమేష్

- వేరుశనగ పంట మద్దతు ధర తగ్గింపుపై ఆగ్రహం
- మార్కెట్ కార్యదర్శి, చైర్‌పర్సన్ భర్తపై దాడి
- కార్యాలయ ఫర్నిచర్ ధ్వంసం.. ఉద్రిక్త పరిస్థితులు
- కల్వకుర్తిలో కొనసాగుతున్న పల్లీ రైతుల ఆందోళనలు

అచ్చంపేట రూరల్: ధర్నాలు చేసినా.. రాస్తారోకోలు నిర్వహించినా.. మా తీరు మారదు. ఎవరు ఎన్ని కష్టాలు పడినా.. నష్టపోయినా మాకు సంబంధం లేదు. మేం నిర్ణయించిందే ధర.. పంట అమ్మితే అమ్మండి.. లేదంటే పోండి.. ఇదీ అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో ట్రేడర్ల తీరు. ఇక్కడ ప్రతిఏటా వేరుశనగ రైతులు రోడ్డెక్కడం పరిపాటిగా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు అరకొర ధర ఇస్తుంటే తట్టుకోలేని రైతులు ఆక్రోశం వెళ్లగక్కారు. తమ ఆవేదనను ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని కోపోద్రిక్తులయ్యారు. ట్రేడర్ల తీరుతో విసిగిపోయిన వారు ఒక్కసారిగా మార్కెట్ కార్యదర్శి నర్సింహులు, చైర్‌పర్సన్ రజిత భర్త మల్లేష్‌పై దాడి చేశారు. కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం చేశారు. దీంతో సోమవారం ఒక్కసారిగా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో ఉద్రిక్తత నెలకొంది. మరోదిక్కు కల్వకుర్తి మార్కెట్‌లోనూ వేరుశనగ రైతులు మద్దతు ధర చెల్లించాలని రోడ్డెక్కారు.



రైతుల దాడిలో గాయపడిన చైర్‌పర్సన్ భర్త మల్లేష్

అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో..

తమకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ మార్కెట్ నుంచి స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వరకు రైతులు ర్యాలీగా వెళ్లారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని రోజు రోజుకు ధర తగ్గిస్తూ ట్రేడర్లు మోసం చేస్తున్నా అధికారులు, పాలకవర్గం ఏం చేస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వం, మార్కెట్ అధికారులు ప్రకటించిన ధర కంటే తమ పంటకు తక్కువగా రావడంతో ఎలాగని ప్రశ్నించారు. తమకు గిట్టుబాటు లేని ధరకు అమ్మితే అప్పుల పాలవుతామన్నారు. ట్రేడర్లు ఇష్టానుసారంగా ధర నిర్ణయిస్తున్నారని, అమాయకులైన రైతులను మోసం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుండి ట్రేడర్లను అచ్చంపేటలోని స్థానిక ట్రేడర్లు రానివ్వడం లేదని, దీంతో స్థానిక ట్రేడర్ల రాజ్యమే నడుస్తుందన్నారు. రాస్తారోకో వద్దకు ఎస్‌ఐ రమేష్ వచ్చి రైతుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని చెప్పడంతో రాస్తారోకోను విరమించారు.

■ అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్‌గా రజిత భర్త మల్లేష్ అంతా తానై చూసుకుంటున్నారని, అధికార, అనధికార కార్యక్రమాల్లో ఆయన్నే పెత్తనం చేస్తున్నారని పాలకమండలి సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. సోమవారం జరిగిన సంఘటనలోనూ రైతులు మల్లేష్‌ను నిలదీశారు. అసలు వ్యవసాయ మార్కెట్‌కు చైర్మన్ ఎవరని ప్రశ్నిస్తున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని, మార్కెట్‌కు వచ్చిన ధాన్యానికి మరోసారి రీ టెండర్ వేస్తామని వ్యవసాయ మార్కెట్ అధికారులు చెబుతున్నారు. కాగా దాడికి పాల్పడిన రైతులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

అంతా కుమ్మక్కయ్యారు..

అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు వివిధ గ్రామాల నుంచి 408 మంది రైతులు 16 వేల బస్తాలలో వేరుశనగ తీసుకొచ్చారు. అయితే గరిష్ట ధర రూ.6,600, కనిష్ట ధరగా మార్కెట్ అధికారులు ప్రకటించారు. తక్కువ ధర పలకడంతో రైతాంగం ఒక్కసారిగా కోపోద్రిక్తులై వ్యవసాయ మార్కెట్‌లోని కార్యాలయం వద్దకు వెళ్లి మార్కెట్ కార్యదర్శి నర్సింహులుతో వాగ్వాదానికి దిగారు. కార్యాలయంలోనే ఉన్న చైర్‌పర్సన్ రజిత భర్త మల్లేష్ వ్యాపారులకే వత్తాసు పలకడంతో.. రైతుల పక్షాన ఉండాల్సిన మీరు ట్రేడర్లతో కుమ్మక్కవుతారా..? అంటూ ఇద్దరిపై దాడి చేశారు. దీంతో కార్యాలయ సిబ్బంది వారిని ఓ గదిలోకి తీసుకుపోయారు. మహిళా రైతులు శాపనార్థాలు, తిట్ల పురాణం అందుకొని కార్యాలయంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు.



అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ వద్ద గుమిగూడిన రైతులు

జాతీయ రహదారి దిగ్బంధం



కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

కల్వకుర్తి రూరల్: వేరుశనగ రైతుల ఆందోళనలు ఆగడం లేదు. గత కొన్ని రోజులుగా వేరుశనగకు గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మార్కెట్‌కు సెలవు కావడంతో సోమవారం 332 మంది రైతులు 369 కుప్పలు వేరుశనగ మార్కెట్లో పోశారు. టెండర్ ప్రక్రియ ప్రారంభం కాగానే 180 కుప్పలకు మాత్రమే రేటు పడిందని, మిగతా వాటికి రేటు వేయలేదని, వ్యాపారులు వెనకంజ వేశారని రైతులు ఆందోళనకు దిగారు. మూడు గంటల పాటు మార్కెట్ ఆవరణలోనే రైతులు ఆందోళన చేపట్టగా.. మార్కెట్ సిబ్బంది చైర్మన్, వైస్ చైర్మన్, నచ్చజెప్పినా రైతులు వినలేదు. తమ సమస్యకు పరిష్కారం చూపాలని, వేరుశనగకు గిట్టుబాటు ధర వచ్చే వరకు తగ్గేది లేదని నినాదాలు చేస్తూ.. రోడ్డుపైకి చేరుకున్నారు.

గంటపాటు రాస్తారోకో

జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారిపై హైదరాబాద్ చౌరస్తాలో వేరుశనగ రైతులు రాస్తారోకోకు దిగారు. వాహనాల రాకపోకలను అడ్డుకునేందుకు నాలుగు వైపులా బైఠాయించి.. న్యాయం కావాలి అంటూ నినాదాలు చేశారు. గంటపాటు జాతీయ రహదారిని దిగ్బంధించడంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళన తీవ్రం కావడంతో కల్వకుర్తి, వెల్దండ సీఐలు నాగార్జున, విష్ణువర్ధన్‌రెడ్డి అక్కడికి చేరుకుని పర్యవేక్షించారు. సీఐలు రైతులకు నచ్చజెప్పి.. మార్కెట్‌కు తీసుకువచ్చారు. అక్కడ వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ భర్త సంజీవ్‌యాదవ్, వైస్ చైర్మన్ పండితరావు, మార్కెట్ డైరెక్టర్లు రైతులతో మాట్లాడారు. రైతుల కుప్పల వద్దకు వెళ్లి వేరుశనగను రాత్రి 7 గంటల వరకు పరిశీలించారు.

పెట్టుబడి వస్తలేదు..



ఈ సంవత్సరం 7 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. వేరుశనగ విత్తనాలకే రూ.70 వేలు ఖర్చు అయ్యాయి. పంట రక్షించుకునేందుకు రసాయనిక మందులు, కూలీ తదితర వాటికి మొత్తం కలిపి రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టిన. ప్రస్తుతం వేరుశనగకు డిమాండ్ లేకపోవడంతో పెట్టిన పెట్టుబడికి తక్కువగానే డబ్బులు వస్తున్నాయి. నా మూడు నెలల కష్టం వృథా అయ్యింది.

– శ్రీనునాయక్, చౌదర్‌పల్లి, వెల్దండ

నాలుగెకరాలు కౌలుకు తీసుకున్న..



వేరుశనగ దిగుబడి బాగా వచ్చి రేటు అధికంగా వస్తుందని నమ్ముకుని నాకు ఉన్న పొలంతోపాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకున్న. పంటకు తెగుళ్లు రావడంతోపాటు అధిక వర్షం కురవడంతో దిగుబడి తగ్గింది. అరకొరగా వచ్చిన పంటకు మద్దతు ధర కూడా రాకపోవడంతో.. పెట్టుబడి సంగతి పక్కన పెడితే కౌలు డబ్బులు చేతి నుంచి కట్టాల్సి వస్తుంది.

– జంగమ్మ, బండోనిపల్లి, వెల్దండ

రైతులకు నష్టం రానివ్వం

రైతులకు ఎలాంటి నష్టం రాకుండా చూస్తామని వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. వ్యాపారులు, రైతులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. వేరుశనగ పంట ఆయిల్ శాతం తక్కువగా ఉండటంతోపాటు ఎగుమతులు లేకపోవడం వల్లే ధరలు తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రైతులు తీసుకొచ్చిన 369 కుప్పలలో 29 కుప్పలకు ఇంకా వ్యాపారులు టెండర్ వేయలేదని మార్కెట్ సిబ్బంది చెప్పారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న రవికుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని పీయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన పీయూలో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించి తర్వాత నోటిఫికేషన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్రమబద్ధీకరణ ఆలస్యం అయితే అధ్యాపకులకు బేసిక్ పే, డీఏ, హెచ్‌ఆర్, ఉద్యోగ భద్రత వంటివి కల్పించాలన్నారు. యూనివర్సిటీలో ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని, పోస్టులు మంజూరు చేసి వేతనం ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్‌కుమార్, కరుణాకర్‌రెడ్డి, విజయ్‌భాస్కర్, ఈశ్వర్‌కుమార్, శ్రీనివాసులు, సురేష్, రామ్మోహన్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

సాంకేతికతతో కూడిన విద్య బోధించాలి



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రమేష్

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సాంకేతికతతో కూడిన విద్యను బోధించాలని డీఈఓ రమేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక స్థాయి టీచర్ల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు సమయపాలన పాటించాలని, అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని, అదే తరహాలో ఉపాధ్యాయులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు చతుర్విధ ప్రక్రియలు వచ్చేలా చూడాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా చేపడుతున్న అపార్ అకౌంట్ ఐడీల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి సమగ్ర వివరాలను ఆన్‌లైన్ చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి నెలలో పేరెంట్ మీటింగ్‌లను విధిగా నిర్వహించాలని, విద్యార్థుల సామర్థ్యాలు, హాజరు తదితర అంశాలను వారి పేరెంట్స్‌తో చర్చించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన డీఈఓ పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడంతోపాటు వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచితో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని కోరారు. డీఈఓ వెంట ఎంఈఓ శంకర్, పాఠశాల కాంప్లెక్స్ ఉపాధ్యాయురాలు ప్రసన్న తదితరులున్నారు.

మున్సిపాలిటీలకు ఊరట..

స్టాంపు డ్యూటీ బకాయిలు రూ.14.64 కోట్లు విడుదల

- ప్రత్యేక ఖాతాలో జమ అయిన డబ్బులు
- వినియోగంపై అధికారులకు మార్గదర్శకాలు జారీ
- ఖర్చులపై ఆంక్షలు విధించిన ప్రభుత్వం
- తీవ్ర నిరాశలో పాలకవర్గాలు



అచ్చంపేట: ఇన్నాళ్లు నిధులు లేక నీరసించిపోతున్న మున్సిపాలిటీలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్టాంపు డ్యూటీ, ఆస్తి మార్పిడి రుసుంకు సంబంధించిన బకాయి నిధులను ఇటీవల విడుదల చేసింది. 2019 నుంచి స్టాంపు డ్యూటీ, 2022 నుంచి ఆస్తి మార్పిడి రుసుం ద్వారా వచ్చిన పన్ను బకాయిల వాటాను జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల ప్రత్యేక ఖాతాల్లో జమచేసింది. దీంతో మున్సిపాలిటీలకు ఊరట లభించింది. ఈ డబ్బు ఖర్చుకు మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది. ప్రతి ఆరు నెలలకోసారి స్టాంపు డ్యూటీ డబ్బులు విడుదల చేస్తే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు, కరెంట్ బిల్లుల చెల్లింపుల ఇబ్బందులు తప్పుతాయని అధికారులు భావిస్తున్నారు.

వేతనాలు, కరెంట్ బిల్లులకే..

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు స్టాంపు డ్యూటీ బకాయిలను విడుదల చేయడంతోపాటు వాటి వినియోగంపై కూడా మార్గదర్శకాలు విడుదల చేసింది. మున్సిపల్ కంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు, కార్యాలయాల కరెంట్ బిల్లుల చెల్లింపులు, ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మాత్రమే ఈ డబ్బులు వినియోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వార్డుల్లో సీసీ రోడ్లు, వీధిలైట్లు, డ్రెయినేజీల నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించవద్దని స్పష్టం చేసింది.

■ నిధుల వినియోగంపై ప్రభుత్వం ఆంక్షలు విధించిన నేపథ్యంలో మున్సిపాలిటీల్లో కొన్ని లర్లు, ఇతర ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులు, వార్డుల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి నిధుల కోసం ఎదురుచూస్తున్న వారికి ఈ ఆంక్షలు మింగుడు పడటం లేదు. విడుదలైన స్టాంప్ డ్యూటీ నిధులతో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లేకపోవడంతో పాలకవర్గాలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

ప్రతి రిజిస్ట్రేషన్‌పై 0.5 శాతం..

మున్సిపాలిటీల పరిధిలో ఖాళీ స్థలాలు, వాణిజ్య భవనాలు, నివాస భవనాలు క్రయ, విక్రయాలు జరిగి రిజిస్ట్రేషన్లు అయితే 0.5 శాతం స్టాంపు డ్యూటీ డబ్బులు ఆయా మున్సిపాలిటీలకు చెల్లించాలి. గతంలో రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే మున్సిపాలిటీల ఖాతాల్లో ఆ మొత్తాన్ని జమ చేసేవారు. కానీ, 2019 సంవత్సరంలో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు తేవడంతో అప్పటి నుంచి మున్సిపాలిటీలకు రావాల్సిన స్టాంపు డ్యూటీ డబ్బులు నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్తున్నాయి. దీంతో ఐదేళ్లుగా స్టాంపు డ్యూటీ డబ్బులు రాకపోవడంతో ఆయా మున్సిపాలిటీలకు ఆదాయం తగ్గింది. ఈ క్రమంలోనే మున్సిపాలిటీలకు రావాల్సిన స్టాంపు డ్యూటీ డబ్బులు చెల్లించాలని మున్సిపల్ చైర్మన్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు ఇటీవల స్టాంపు డ్యూటీ డబ్బులు మున్సిపాలిటీల ఖాతాల్లో జమ చేసింది. దీంతో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్‌లకు సంబంధించి రూ.14.64 కోట్లు విడుదలయ్యాయి.

మున్సిపాలిటీల వారీగా ఇలా..

మున్సిపాలిటీ	నిధులు (రూ.కోట్లలో)
కల్వకుర్తి	6.17
నాగర్‌కర్నూల్	5.13
అచ్చంపేట	2.12
కొల్లాపూర్	1.22

గతంలో 4 శాతం నిధులు

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్టాంపు డ్యూటీని గతంలో 4 శాతం స్థానిక సంస్థల ఖాతాల్లో నేరుగా జమ చేసేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నిధులను మున్సిపాలిటీలకు ఇవ్వకుండా ప్రభుత్వం నేరుగా తీసుకుంది. ఆ తర్వాత పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి పేరుతో ప్రతినెలా కొన్ని నిధులు స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేసింది. వీటితో ఆయా మున్సిపాలిటీలు, పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టేవారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టణ, పల్లె ప్రగతి కార్యక్రమాలను నిలిపివేశారు. నిధులు లేక మున్సిపాలిటీల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించి బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి.

మార్గదర్శకాల ప్రకారమే..



రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీకి స్టాంపు డ్యూటీ డబ్బులు విడుదల చేసింది. ఐదేళ్ల స్టాంపు డ్యూటీకి సంబంధించి అచ్చంపేట మున్సిపాలిటీకి రూ.2 కోట్లు వచ్చాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ఈ నిధులు ఖర్చు చేస్తాం. ఇందులో నుంచి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు, కరెంట్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇతర అవసరాలకు ఉపయోగించడానికి అవకాశం లేదు. – శ్యాంసుందర్, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

పన్నుల వసూళ్లలో వేగం పెంచాలి



మాట్లాడుతున్న కమిషనర్ మహమూద్ షేక్

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని ఆస్తి పన్ను వసూళ్లలో వేగాన్ని పెంచాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో ఆస్తిపన్ను వసూలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లలో ఎదురవుతున్న సమస్యలను అధిగమిస్తూ లక్ష్యం చేరుకోవాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆస్తిపన్నుతోపాటుగా నీటి కుళాయిల పాత బకాయిల వసూళ్లపై దృష్టిసారించాలన్నారు. పన్నుల వసూలుతోనే పట్టణాభివృద్ధికి బాటలు వేయవచ్చని, ప్రజలు సైతం స్వచ్ఛందంగా పన్నులు చెల్లించి మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. అనంతరం మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా నియమితులైన అదనపు కలెక్టర్ దేవసహాయంను కమిషనర్ మర్యాదపూర్వకంగా కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిశారు.

గడువు పొడిగింపు

కందనూలు: ఓపెన్ కేటగిరి దివ్యాంగులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవడానికి మార్చి 31 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

క్లుప్తంగా

కళాశాలకు వెళ్లమని చెప్పినందుకు..

- ఉరేసుకుని విద్యార్థి మృతి

గద్వాల క్రైం: కళాశాలకు వెళ్లి చదువుకొమ్మని మందలించిన తల్లి మాటలకు తీవ్ర కలత చెందిన ఓ మైనర్ విద్యార్థిని ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. గద్వాల మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన బోయ పావని (16) వనపర్తి జిల్లాలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. అయితే ఇటీవల సంక్రాంతి సెలవులపై స్వగ్రామానికి వచ్చి ఇంటి వద్దనే ఉంటుంది. ఈ క్రమంలో సోమవారం తల్లి మణెమ్మ కళాశాలకు వెళ్లాల్సిందిగా మందలించి కూలీ పనులకు వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన విద్యార్థిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తల్లి కూలీ పనులు ముగించుకుని ఇంటికి వచ్చి తలుపు తట్టగా ఎంతకీ తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికిలోంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ ఉంది. దీంతో స్థానికుల సహాయంతో తలుపులు తీసి కిందకు దింపగా.. అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ఘనటపై తల్లి మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి..

దేవరకద్ర రూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం కౌకుంట్ల మండలంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ సయ్యద్‌అక్బర్ కథనం మేరకు.. కౌకుంట్ల-పేరూర్ గ్రామాల మధ్య ఉన్న రైల్వే పట్టాల పక్కన గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గుడిపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకోగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి గ్రామానికి చెందిన జంగం మల్లేష్ (40) తన అక్కలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఇంటిని విక్రయించి డబ్బులు కావాలని కుటుంబసభ్యులను అడగటంతో అందుకు వారు నిరాకరించారు. దీంతో క్షణికావేశానికి గురైన మల్లేష్ ఆదివారం గుడిపల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం మధ్యాహ్నం స్థానికులు చెరువులో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మల్లేష్ అక్క అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం..

కేసరి సముద్రం చెరువులో దూకి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన సుమలత సోమవారం మినీట్యాంక్ బండ్ వద్ద కేసరి సముద్రం చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీన్ని గమనించిన స్థానికులు ఆమెను వెంటనే రక్షించారు. మహిళ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ గోవర్ధన్ పేర్కొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

కొత్తకోట రూరల్: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన సోమవారం కొత్తకోట మండలంలోని చర్లపల్లి, అప్పరాల గ్రామాల శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలు.. చర్లపల్లికి చెందిన బత్తుల సుందర్‌గౌడ్ అప్పరాల శివారులో గల తన వ్యవసాయ పొలంలో కోడిపందెలు, పేకాట ఆడిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న సీసీఎస్, కొత్తకోట పోలీసులు ఉమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో పలువురు పారిపోగా.. ఆరుగురిని అరెస్ట్ చేయడంతో పాటు మూడు సెల్‌ఫోన్లు, 10బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడులు

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో గుట్టుగా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇంటిపై పట్టణ పోలీసులు దాడులు చేపట్టి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని బీరోలు చౌరస్తాలోని ఓ ఇంటిలో కడప జిల్లా ఇందిరానగర్‌కు చెందిన రమణయ్యగౌడ్ కొన్ని నెలలుగా వ్యభిచార దందాను గుట్టుగా నిర్వహిస్తున్నాడు. అయితే సోమవారం సాయంత్రం నమ్మదగిన సమాచారం మేరకు వ్యభిచార గృహంపై దాడులు చేపట్టిన పోలీసులు ఇద్దరు మహిళలు, ముగ్గురు విటులతో పాటు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7 సెల్‌ఫోన్లు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే 20 రోజుల క్రితం ఇదే తరహాలో జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీలో పట్టుబడిన ఘటన మరవక ముందే మరోసారి పట్టణంలో వ్యభిచార దందా వెలుగులోకి రావడంతో జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారంలో దాగి ఉన్న ప్రధాన సూత్రదారులెవరో గుర్తిస్తే తప్ప ఈ దందాను కట్టడి చేయొచ్చని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

ఎంఆర్ఐ సేవలు ఎప్పుడో?

- ఉగాది నాటికి ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి
- మిషన్ ఏర్పాటుకు సమయం సరిపోదంటున్న అధికారులు



పాలమూరు: ఉగాది నాటికి మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని ఇటీవల రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఈ అంశంపై సోమవారం హైదరాబాద్‌లోని డీఎంఈ వద్ద జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు టీఎస్ఎంఎస్ఐడీసీ ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. రూ.8కోట్ల నుంచి రూ.10కోట్ల వ్యయంతో ఎంఆర్ఐ మిషన్ ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న జిల్లా జనరల్ ఆస్పత్రి భవనంలో ఎంఆర్ఐ మిషన్ ఏర్పాటు చేయాలా? లేక నూతనంగా నిర్మించే సూపర్ స్పెషాలిటీ భవనంలో అందుబాటులోకి తీసుకురావాలనే అంశాలపై అధికారుల మధ్య తర్జనభర్జన కొనసాగుతోంది. మంత్రి ఇచ్చిన హామీ మేరకు ఉగాది నాటికి జనరల్ ఆస్పత్రిలో ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి తీసుకురావడం కష్టమేనని భావిస్తున్నారు. ఎంఆర్ఐ మిషన్ ఏర్పాటు చేయాలంటే కొత్తగా ఒక విభాగం నిర్మించి.. మిషన్ సెటాప్ చేయడానికి చాలా సమయం పడుతుందని చెబుతున్నారు. ఇక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎంఆర్ఐ విభాగం ఏప్రిల్ నాటికి ఏర్పాటు చేసుకోవడం సాధ్యం కాదని. ఆ భవనం పూర్తయి ప్రారంభం కావడానికి దాదాపు 6 నుంచి 12 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలోని రేడియాలజీ హబ్ భవనంలో ఉన్న గదులు ఎంఆర్ఐ మిషన్ సరిపోయే స్థాయిలో లేవు. కొత్తగా భవనం నిర్మించాలంటే కనీసం 6 నెలల సమయం పడుతుంది. ఈ క్రమంలో జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఎంఆర్ఐ సేవలు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఉగాది నాటికి సేవలను అందుబాటులోకి తీసుకువస్తారా? లేదా అనేది పెద్ద ప్రశ్నగా మారింది. ఈ విషయంపై సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్‌ను వివరణ కోరగా.. హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ అధికారులతో పాటు వైద్యులతో డీఎంఈ చర్చించారని, పూర్తి నివేదిక ఇవ్వాలని కోరారని తెలిపారు. మరో వారం రోజుల్లో ఎంఆర్ఐ మిషన్ ఏర్పాటుపై ఒక అంచనా వస్తోందని వెల్లడించారు.

సరిహద్దు గ్రామాలకు చార్జీల మోత

- రూ.10 చొప్పున పెంచిన ఆర్టీసీ
- కృష్ణా మండలంలో మాత్రమే పెంచిన వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



గుడెబల్లూర్ నుంచి రాయచూర్‌కు రూ.60 టికెట్

కృష్ణా: రాష్ట్రంలో ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచలేదు. కానీ సరిహద్దు గ్రామాల ప్రజలు తమ అవసరాల నిమిత్తం కర్ణాటకలోని రాయచూర్ పట్టణానికి తెలంగాణకు చెందిన హైదరాబాద్ డిపో బస్సుల్లో వెళ్తే మాత్రం వారికి టికెట్ ధర రూ.10లు పెంచి తీసుకుంటున్నారు. గతంలో గుడెబల్లూర్ నుంచి రాయచూర్ పట్టణానికి వెళ్తే రూ.50లు ఉండేది. ఇప్పుడు మాత్రం రూ.60లు వసూలు చేస్తున్నారు. ఇదేమని ప్రయాణికులు ప్రశ్నిస్తే కర్ణాటకలో బస్సు చార్జీలు పెంచడం మూలంగా తాము పెంచినట్లు చెబుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచ లేదు, కానీ కేవలం సరిహద్దు గ్రామాల ప్రజలు కర్ణాటకకు వెళ్లే వారికి మాత్రం టికెట్ ధర పెంచారు. తాము తెలంగాణ వాళ్లం, తెలంగాణ రాష్ట్రంలోని బస్‌స్టాప్‌ల నుండి వెళ్లినా వారికి చార్జీలు పెంచడం దారుణం. కర్ణాటకలోని పలుస్టాప్‌ల నుంచి ప్రయాణించే ప్రయాణికులకు పెంచినా ఓ అర్థం ఉంటుంది. కానీ మన ప్రాంతం నుంచి మనబస్సుల్లో ప్రయాణించినా బస్సు చార్జీలు పెంచడం ఏంటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై త్వరలోనే అన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని సరిహద్దు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై నారాయణపేట డీఎం లావణ్యను వివరణ కోరగా, రాయచూర్‌కు తమ డీపో బస్సులు వెళ్లడం లేదని, కేవలం హైదరాబాద్ డీపో బస్సులు వెళ్తాయి, వారినే అడగండి అని సమాధానం ఇచ్చారు. పెంచిన చార్జీలు తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని ప్రయాణికులు పేర్కొన్నారు.

చార్జీలు పెంచడం సరికాదు..



ఒక్కో వ్యక్తికి రూ.10లు పెంచడం భారంగా ఉంది. సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు ప్రతిరోజు రాయచూర్ పట్టణానికి పలు అవసరాల నిమిత్తం బస్సులో ప్రయాణిస్తుంటారు. ఒక్కో వ్యక్తికి రూ.10లు టికెట్ ధరలు పెంచడం మాకు భారంగా ఉంది. కర్ణాటక ప్రభుత్వం బస్సులకు రూ.6లు పెంచితే, మన ప్రాంత బస్సులకు రూ.10లు పెంచడం సరికాదు. ఈ విషయంపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– శివప్ప, గుడెబల్లూర్

హాస్టల్ విద్యార్థి హఠాన్మరణం



ఆందోళనకు దిగిన విద్యార్థి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పుతున్న అధికారులు

చదువుకుంటూనే కుప్పకూలిన 8వ తరగతి విద్యార్థి

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- వనపర్తి జిల్లా గోపాల్‌పేట ఎస్సీ వసతిగృహంలో ఘటన



ఉడుముల భరత్ (ఫైల్)

గోపాల్‌పేట/వనపర్తి రూరల్: వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న ఓ విద్యార్థి అకస్మాత్తుగా కుప్పకూలి హఠాన్మరణం చెందాడు. ఈ ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, సంబంధిత అధికారుల వివరాల మేరకు.. ఏదుట్ల గ్రామానికి చెందిన ఉడుముల వెంకటస్వామి-అరుణకు ఇద్దరు కుమారులు ఉండగా.. పెద్ద కుమారుడు భరత్ (13) మండలకేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే అందరితో పాటు నిద్రించాడు. సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో నిద్రలేచి స్నానం చేసిన అనంతరం 7 గంటలకు స్టడీ అవర్స్‌లో తోటి విద్యార్థులతో కలిసి హాస్టల్ ఆవరణలో చదువుకుంటుండగా.. ఉన్నట్టుండి కూర్చున్న చోటే కుప్పకూలిపోయాడు. గమనించిన వంట మనుషులు విద్యార్థి వద్దకు చేరుకుని చేతిలో తాళాలు పెట్టి.. చేతులు, కాళ్లు రాశారు. ఆ తర్వాత స్థానిక పీహెచ్‌సీకి ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లగా.. విద్యార్థి పరిస్థితి విషమంగా ఉందని, త్వరగా జిల్లా ఆస్పత్రికి తరలించాలని సిబ్బంది సూచించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో వనపర్తి ఎంసీహెచ్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అంతకు ముందు డాక్టర్లు సీపీఆర్ ఇతర ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. కార్డియాక్ అరెస్టు జరిగినట్లు డాక్టర్లు తెలిపారు. విద్యార్థి మరణవార్త తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

న్యాయం చేయాలని ఆందోళన..

అధికారుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ మృతిచెందాడని..తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి కుటుంబ సభ్యులు వనపర్తి-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు అక్కడికి చేరుకుని విద్యార్థి కుటుంబసభ్యులకు నచ్చజెప్పారు. సమగ్ర విచారణ జరిపించి, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కాగా, గుండెపోటుతోనే విద్యార్థి మరణించినట్లు ఎంసీహెచ్ ఆర్ఎంఓ జావెద్ తెలిపారు.

ప్రైవేట్ యాప్‌లో నగదు పెట్టి మోసపోయిన వ్యక్తి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రైవేటు యాప్‌లో నగదు పెట్టి మోసపోయిన సంఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని ఓంనగర్‌కాలనీకి చెందిన సతీష్ ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. అయితే ఇతను డెకత్లాన్ ప్రైవేట్ యాప్‌లో నగదు పెట్టుబడిగా పెడితే పెద్దమొత్తంలో వస్తాయని నమ్మి గతేడాది డిసెంబర్ 31 నుంచి ఈ నెల 15 వరకు రూ.5.20 లక్షలకు పైగా నగదు పెట్టాడు. చివరికి డెకత్లాన్ ప్రైవేటు యాప్ పనిచేయకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

తెలకపల్లి: మండలంలోని నడిగడ్డ సమీపంలోని దుందుభీ వాగు నుంచి అనుమతుల పేరుతో నాలుగైదు రోజులుగా ఇసుక తరలిస్తున్నారు. వాగులో ఇసుక తరలింపుతో భూగర్భజలాలు తగ్గుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దుందుభీ వాగు పరీవాహక ప్రాంతంలో ఎంతో మంది రైతులు వ్యవసాయ బోరుబావులను నమ్ముకుని పంటలు పండిస్తున్నారని తెలిపారు. వాగులో ఇసుక తరలింపుతో బోరుబావుల్లో నీటిమట్టం తగ్గుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి ఇసుక అనుమతులను రద్దు చేయాలని కోరారు.

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



మట్టి తవ్వకాల వద్ద విచారణ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అడ్డాకుల: మండలంలోని కాటవరం శివారులోని గుట్టవద్ద చేపట్టిన మట్టి తవ్వకాలను సోమవారం సాయంత్రం గ్రామస్తులు అడ్డుకున్నారు. పెద్దమందడి మండలం వెల్టూర్ స్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గుట్ట నుంచి మట్టి తవ్వకాలు చేపట్టారు. ప్రభుత్వ అనుమతితో చేపట్టిన తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకుని నిరసన తెలిపారు. గ్రామానికి సమీపంలో ఉన్న గుట్ట నుంచి మట్టి తవ్వకాలు చేపట్టవద్దని టిప్పర్లను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ సిబ్బంది గుట్ట వద్దకు వెళ్లి విచారణ చేశారు.

గుండెపోటుతో గిరిజనుడి మృతి

- రాళ్ల పేలుళ్ల శబ్దంతోనే మృతి చెందాడని ఆందోళన
- పోలీసుల జోక్యంతో శాంతించిన బంధువులు



ఆందోళన చేస్తున్న గిరిజనులతో మాట్లాడుతున్న పోలీసులు



రాములునాయక్ (ఫైల్)

నవాబుపేట: మండలంలోని శామగడ్డతండాకు చెందిన 64 ఏళ్ల విస్లావత్ రాములునాయక్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. కాగా ఈ ఘటన జరిగిన సమయంలో తండాకు సమీపంలోనే రాళ్లగుట్టల్లో డైనమెట్లతో పేల్చారని, శబ్దం కారణంగా రాములునాయక్‌కు గుండెపోటు వచ్చిందని గిరిజనులు సోమవారం ఆందోళన చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని కారుకొండ పంచాయతీ పరిధిలో గల శామగడ్డతండాలో ఆదివారం రాత్రి రాములునాయక్ ఇంటి బయట ఉండగా ఒక్కసారిగా పెద్దఎత్తున పేలుళ్ల శబ్దం రావడంతో అతడు అక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు గ్రామస్తులు వివరించారు. దీంతో తండాకు సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా పేలుళ్లు చేస్తున్నారని, ఇందుకు బాధ్యులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల ఆందోళన తీవ్రం కావటంతో రూరల్ సీఐ గాంధీనాయక్, నవాబుపేట ఎస్ఐ విక్రమ్ ఘటన స్థలానికి చేరుకుని గిరిజనులతో మాట్లాడారు. వారికి న్యాయం జరిగేలా చూస్తామని హామీనివ్వడంతో గిరిజనులు శాంతించారు. తండా ఉద్ధం డాపూర్ రిజర్వాయర్ పరిధిలో ఉండగా దానికి అనుకుని ఉన్న గుట్టప్రాంతంలో పేలుళ్లు చేపట్టినట్లు సమాచారం. వీటికి సంబంధించి అనుమతులు ఉన్నయా.. లేదా అనే అంశంపై అధికారులతో చర్చించి, చర్యలు తీసుకుంటామని పోలీసులు వివరించారు.

జాలర్లకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి



పెంట్లవెల్లి సంక్షేమ హాస్టల్‌లో ఉన్న యువకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ జయంతి

పెంట్లవెల్లి: కృష్ణానది తీరాన నిషేధిత అలివి వలల ద్వారా రాత్రి, పగలు తేడా లేకుండా చేపలు పట్టేందుకు ఆంధ్ర నుంచి కార్మికులను పిలిచి కాంట్రాక్టర్లు ఇబ్బందులు పెడుతున్నారు. ఒకవైపు కృష్ణానది, మరోవైపు అడవులు ఉండడంతో ఎటూ వెళ్లే అవకాశం లేకపోవడంతో దళారులు వారిని చిత్రహింసలకు గురిచేసి వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. దళారులు పెట్టే బాధలు భరించలేక వారు పారిపోయి పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో దాచుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ సోమవారం రాత్రి 8 గంటలకు అక్కడకు చేరుకొని కార్మికులను పరామర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జయంతి మాట్లాడుతూ పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామాల సమీపంలో కృష్ణానది తీరాన నిషేధిత అలివి వలలు లాగడానికి వీరిని తీసుకొచ్చారన్నారు. వారిని సొంత గ్రామాలకు కూడా వెళ్లనీయకుండా దళారులు ఇబ్బందులకు గురి చేశారని, యువకులు ఏదో రకంగా మండల కేంద్రానికి చేరుకొని స్థానిక సంక్షేమ హాస్టల్‌లో ఉండడంతో కొంతమంది తమకు సమాచారం ఇవ్వగా.. స్థానిక పోలీసులతో వెళ్లి వారితో మాట్లాడామన్నారు. అందులో బీహార్, విజయవాడ, రాజమండ్రి, సికింద్రాబాద్, మహబూబ్‌నగర్, విశాఖపట్నం వంటి ప్రాంతాల నుంచి వచ్చిన వారున్నారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడామని.. మంగళవారం వీరిని కొల్లాపూర్ ఆర్డీఓకు అప్పగిస్తామని, వారి సూచన మేరకు సొంత గ్రామాలకు పంపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా లేబర్ ఆఫీసర్ రాజుకుమార్, లీగల్ ఆఫీసర్ విజయరాజు, ఆర్ఐ శివన్నగౌడ్, ఎస్ఐ రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

అచ్చంపేట రూరల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన అచ్చంపేట మండలం పెద్దతండాలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం... తండాకు చెందిన రైతు శ్రీను (43) వరి పొలానికి నీరు పారించడానికి సోమవారం ఉదయం వెళ్లాడు. అయితే బోరు మోటారుకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో సంబంధిత లైన్‌మేన్ శంకర్‌తో పాటు ఇతర విద్యుత్ అధికారులకు ఎల్‌సీ కోసం ఫోన్ చేశాడు. వారు ఎల్‌సీ ఇవ్వడం కుదరదని చెప్పడంతో.. చేసేది లేక తానే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ఏబీ స్విచ్ ఆఫ్ చేయాలని భావించాడు. స్విచ్‌ను ఆఫ్ చేసే క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే రైతు శ్రీను మృతి చెందాడని కుటుంబ సభ్యులు పేర్కొంటూ.. మృతదేహాన్ని అచ్చంపేటకు తీసుకువచ్చి రాస్తారోకో నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌శాఖ ఏఈ ఆంజనేయులు అక్కడికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వపరంగా ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. మృతుడికి భార్య తారితో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దాపూర్ ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

కాపురానికి రమ్మంటే కాల్చి చంపింది

- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

కొత్తకోట రూరల్: భార్యను కాపురానికి రమ్మని భర్త అడగడంతో నిరాకరించిన ఆమె గాఢనిద్రలో ఉన్న భర్తపై గుర్తుతెలియని రసాయనిక పదార్థం పోసి నిప్పటించింది. దీంతో తీవ్రగాయాల పాలైన సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోటలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ ఆనంద్ కథనం ప్రకారం.. ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్ల గ్రామానికి చెందిన గోటు మహేష్(32)కు ఎనిమిదేళ్ల క్రితం కొత్తకోట మండలం సత్యహళ్లి గ్రామానికి చెందిన మహేశ్వరితో వివాహం జరిగింది. వీరికి ఏడేళ్ల వయస్సున్న ఇద్దరు ఆడ కవల పిల్లలు ఉన్నారు. మహేష్ కొంతకాలంగా సత్యహళ్లిలోనే ఉంటూ కొత్తకోటలో మేస్త్రీ పనిచేస్తుండేవాడు. ఇటీవల భార్యాభర్తలు తరచూ గొడవ పడుతుండేవారు. కుటుంబ కలహాలతో ఇబ్బందులకు గురైన మహేష్ తాగుడుకు బానిసయ్యాడు. దీంతో మహేష్‌కు అప్పులు ఎక్కువ కావడంతో మేస్త్రీ పనిచేసేందుకు 9 నెలల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. మహేశ్వరి మాత్రం పిల్లలతో కలిసి సత్యహళ్లిలోనే ఉంటుంది. 20 రోజుల క్రితం పిన్నంచర్ల గ్రామానికి చేరుకుని భార్యను తన వెంట హైదరాబాద్ తీసుకెళ్లేందుకు ఆమెను ఒప్పించాలని కుటుంబ సభ్యులను కోరాడు. అందుకు మహేష్ కుటుంబ సభ్యులు మహేశ్వరి దగ్గరకు వచ్చి హైదరాబాద్ వెళ్లాలని పెద్ద మనుషులు సూచించినా ఆమె ఒప్పుకోలేదు. పైగా మహేష్ అంటే ఇష్టం లేదని, అతనికి విడాకులు ఇస్తానడంతో అందుకు ఆమె తల్లిదండ్రులు వారించి కాపురాన్ని కొత్తకోటకు మార్చారు. ఆదివారం మధ్యాహ్నం మహేష్ గాఢ నిద్రలో ఉన్నాడని గమనించిన మహేశ్వరి భర్తపై ఏదో లిక్విడ్ జల్లి నిప్పంటించింది. అంతటితో ఆగక మహేష్ సోదరుడు సురేష్‌కు ఫోన్ చేసి మీ అన్న నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశాడని చెప్పింది. తీవ్ర గాయాలైన మహేష్‌ను స్థానికులు వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలోనే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహేష్‌ను తమ్ముడు సురేష్ ఎలా జరిగిందని వివరాలు అడిగి తెలుసుకుని ఫోన్‌లో రికార్డ్ చేశాడు. డాక్టర్ల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై మహేష్ తమ్ముడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేశ్వరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రంగనాయకుల గుట్టను పర్యాటకంగా తీర్చిదిద్దాలి



రంగనాయకస్వామి గుట్టపై మహిషాసుర మర్దిని, భైరవ శిల్పాలను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

జడ్చర్ల: బాదేపల్లి రంగనాయకుల స్వామి గుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన రంగనాయకస్వామి గుట్టను సందర్శించి.. చారిత్రక శిల్పాలు, శాసనాలు, స్థలాలు, ఆనాటి నిర్మాణ కట్టడాలు, గుట్ట ప్రాధాన్యతను గుర్తించి వివరించారు. ప్రధాన ఆలయమైన రంగనాయకస్వామి రాతి శిల్పం దాని వెనుక వంద అడుగుల దూరంలో గల మహిషాసుర మర్దిని, భైరవ శిల్పాలు కీ.శ., 13వ శతాబ్ది నాటి కాకతీయుల కాలానికి చెందినవన్నారు. అలాగే గుట్టపై విశాలమైన కోట గోడ ఆనవాళ్లు ఉన్నాయని, పునాది కోసం కొండపైన ఏడు అడుగుల విశాలమైన రాతిని మలిచారని, అనేకచోట్ల బండలపై ఆనాటి రాతిని చీల్చిన క్వారీ గుర్తులు ఉన్నాయన్నారు. మరో బండపై ఉలితో చెక్కిన విజయనగరకాలపు ఆంజనేయుడి రేఖాచిత్రం, ఆదిమానవుడు నివసించిన కొండచరియ ఆవాసాలు ఉన్నాయన్నారు. ఇన్ని ఆకర్షలు కలిగిన రంగనాయకుస్వామి గుట్టపై భక్తులకు మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గుట్టపై విశ్రాంతి మందిరాలు, రెస్టారెంట్, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్, పిల్లల ఆటలకు సంబంధించిన ఏర్పాట్లు కల్పించడంతోపాటు భద్రత కోసం గుట్ట చుట్టూ రక్షణగా ఇనుప కంచె నిర్మించాలని కోరారు. అలాగే కాకతీయుల కాలంలో చెక్కిన శిల్పాలపై ఎక్కడికక్కడ భక్తులు రంగులు వేసి వాటి విశిష్టతను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రంగులు వేయకుండా ఉంటే చరిత్రకు సంబంధించి గుర్తులు చెరిగిపోకుండా ఉంటాయని, రంగులు వేయడం వలన శిల్పాల చరిత్ర ఆనవాళ్లు దెబ్బతింటాయన్నారు.